జిల్లాలో 92 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తిటౌన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం తొలిరోజు 92.27 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ పీడీ నరసయ్య తెలిపారు. ఉదయం 6.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పంపిణీ కొనసాగిందన్నారు. ధర్మవరం మండలంలో అత్యధికంగా 94.44 శాతం, అమరాపురంలో అత్యల్పంగా 89.29 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. మిగిలిన వారికి మంగళవారం అందజేస్తామన్నారు. పుట్టపర్తి మండలం పెడపల్లిలో కలెక్టర్ టీఎస్ చేతన్.. లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. అర్హులందరికీ పింఛన్ అందజేస్తామన్నారు.



పెడపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్


అనుమతులు తప్పనిసరి

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్య కేంద్రాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం సోమవారం పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో పలు స్కానింగ్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. హిందూపురంలోని వాసుకీ ఫెర్టిలిటీ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. ప్రతినెలా ఫెర్టిలిటీ సేవలు పొందుతున్న వారి వివరాలు తప్పక జిల్లా వైద్య అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ఐవీఎఫ్ సేవలున్నాయనీ, ఉచిత కన్సల్టెన్సీ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయరాదన్నారు. పెద్దనగరాలకు ఐవీఎఫ్ సెంటర్లకు రెఫర్ చేయరాదన్నారు.

57 దరఖాస్తులు

కదిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలక మండలి నియామకానికి సంబంధించి 57 దరఖాస్తులు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. దరఖాస్తు గడువు ముగియడంతో పాలక మండలి నియమకానికి చర్యలు చేపట్టారన్నారు.



వైసీపీ విమర్శలు అర్థరహితం

● మంత్రి సవిత



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి, మహిళలు

సోమందేపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న విమర్శలు అర్థరహితమని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము.. లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇటీవల దివ్యాంగుల పింఛన్ తొలగిస్తున్నారంటూ వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక దిక్కుతోచని పరిస్థితుల్లో వైసీపీ ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని ఆమె ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఏడాదిన్నరలోనే అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రి అయి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. శ్రేణులు, మహిళలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, టీడీపీ జిల్లా కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, నియోజకవర్గ కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు: ఎస్పీ



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ, సిబ్బంది

హిందూపురం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గణేష్ శోభాయాత్ర, మిలాద్-ఉన్-నబీ పండుగ శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. పట్టణంలో సోమవారం ముస్లిం మతపెద్దలతో ఎస్పీ సమావేశం అయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఈనెల 4న శోభాయాత్ర, 5న మిలాద్-ఉన్-నబీ పండుగను ప్రశాంతంగా జరుపుకుందామన్నారు. అనంతరం నిమజ్జనం, శోభాయాత్ర వెళ్లే రూట్లను పరిశీలించారు. పట్టణంలో కవాతు నిర్వహించారు. బందోబస్తుపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, కరీం, జనార్దన్ పాల్గొన్నారు.

మద్యం షాపులు బంద్

హిందూపురంలో నిమజ్జనం పురస్కరించుకుని ఈనెల 3న సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటల వరకు మద్యం షాపులు బంద్ చేయాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 5నుంచే బార్లు, మద్యం దుకాణాలు మూసేయాలన్నారు.

అక్షరం అండగా.. పరిష్కారం వడివడిగా..

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. ఆంధ్రజ్యోతి ABN

కొత్తచెరువు సదస్సులో సమస్యలపై జనస్వరం..

వేగవంతంగా పరిష్కారానికి ఎమ్మెల్యే, అధికారుల హామీ



విజయనగర్ కాలనీలో కొత్తగా నిర్మించిన ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి (ఫైల్)

● ఇప్పటికే కొన్ని పరిష్కారం ● వివిధ దశల్లో మిగతావి..

నేడు సక్సెస్ సభ

పుట్టపర్తి/కొత్తచెరువు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ప్రజా సమస్యలు చకచకా పరిష్కారమవుతున్నాయి. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' నినాదంతో ఈఏడాది జనవరి 28న కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అప్పట్లో సదస్సుకు కొత్తచెరువు బీసీ కాలనీ, ఎన్టీఆర్ నగర్, వేణుగోపాల్ నగర్, మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల ఎదుట విన్నవించారు. 28 మంది నేరుగా తమ సమస్యలను ఏకరవు పెట్టారు. అప్పట్లో సదస్సుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కొత్తచెరువు సర్పంచ్ రాధతోపాటు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. వందలాది మంది తమ సమస్యలను వినతిపత్రం రూపంలో ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. వాటిలో అవకాశం ఉన్నవాటిని తక్షణమే, మరి కొన్నింటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే, అధికారులు తెలిపారు. ప్రజాసమస్యలపై అధికారులకు ఎమ్మెల్యే చురకలు అంటించారు. చాలా వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. కొన్నింటికి కొంచెం గడువు పెట్టుకుని మొదటి ప్రాధాన్యత ప్రకారం పరిష్కరించేలా ప్రతిపాదనలు చేశారు. వాటి పరిష్కారానికి రూ.5.25 కోట్లదాకా అవుతుందని అంచనా వేశారు. ప్రధానమైన 18 సమస్యల్లో కొన్నింటిని పరిష్కరించారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో (మిగతా 6లో...)

సూపర్ సిక్స్... సూపర్ హిట్..

- 15 నెలల్లో పథకాలు విజయవంతంగా అమలు
- 10న అనంతలో బహిరంగ సభ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు: మంత్రి పయ్యావుల కేశవ్
- పవన్ కల్యాణ్ కూడా వస్తారు..: జనసేన
- ఏర్పాట్లపై కూటమి నేతల సమావేశం
- సభాస్థలం పరిశీలన

6 లో



చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌కు తినిపిస్తున్న మంత్రి కేశవ్, చిత్రంలో ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు

జిల్లాకు రెండు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు



పొగాకు సోమ శేఖర్

పత్తి చంద్ర శేఖర్




పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మరోరెండు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు దక్కాయి. చాలాకాలంగా ఎదురు చూస్తున్న కూటమి నాయకులకు సోమవారం ఊరట దక్కింది. ఇందులో గోరంట్లకు చెందిన టీడీపీ మండల మాజీ కన్వీనర్ పొగాకు సోమశేఖర్‌ను ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. జనసేన పార్టీకి చెందిన పత్తి చంద్రశేఖర్‌కు రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బిల్లుల బాధలు..!

అప్పులు చేసి.. అభివృద్ధి పనులు



- నెలలు గడుస్తున్నా.. అందని బిల్లులు
- వడ్డీలు కట్టలేక కూటమి నేతల అవస్థలు
- కొత్త పనులు చేసేందుకు ససేమిరా





హిందూపురంలోని సెరికల్చర్ కాలనీలో వేసిన రోడ్డు

హిందూపురం మండలానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు గతేడాది నవంబరులో ఇంట్లోని బంగారు నగలను రూ.5లక్షలకు తాకట్టుపెట్టి, మరో రూ.10లక్షలు రూ.3 వడ్డీతో తీసుకుని పల్లె పండుగ కింద రోడ్డు, డ్రైనేజీ కాలువల పనులు చేపట్టారు. జనవరిలోనే పూర్తి చేశారు. నేటికీ బిల్లులు అందలేదు. తీసుకున్న అప్పునకు ప్రతినెలా రూ.30వేలు వడ్డీ చెల్లిస్తున్నారు. ఇప్పటికే పది నెలలు పూర్తయి రూ.3.5 లక్షలు వడ్డీ కట్టారు. అప్పు ఇచ్చిన వారు డిమాండ్ చేస్తున్నారు. బిల్లులు రాక దిక్కులు చూస్తున్నారు.

హిందూపురానికి చెందిన ఓ రేషన్ డీలర్ వడ్డీకి అప్పు తీసుకుని, లేపాక్షి మండలంలో రూ.30 లక్షల మేర రోడ్డు పనులు చేశాడు. పూర్తయి తొమ్మిది నెలలవుతున్నా బిల్లులు రాలేదు. తీసుకున్న అప్పునకు ప్రతినెలా రూ.60 వేలు వడ్డీ చెల్లిస్తున్నాడు. దీంతో మరో రెండు నెలలు బిల్లులు రాకపోతే ఉన్న ఇంటిని అమ్మకానికైనా పెట్టాలి, తాకట్టు పెట్టయినా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

హిందూపురం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు గతేడాది డిసెంబరులో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. సామాన్య కార్యకర్త కావడంతో ఆయన వద్ద డబ్బు లేకపోవడంతో ఇతరుల వద్ద అప్పు తీసుకుని, పనులు చేశాడు. ఇప్పటివరకు బిల్లులు అందలేదు. భార్య మాంగల్యం చైను తాకట్టు పెట్టి, వడ్డీ కడుతున్నాడు. ఇలాంటివారు పదుల సంఖ్యలో ఉన్నారు. వీరంతా తెలుగుదేశం పార్టీ నాయకులే.

హిందూపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గతేడాది కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గోకులం షెడ్ల పనులు చేపట్టారు. మొదటి విడత కింద హిందూపురం నియోజకవర్గానికి రూ.30 కోట్లతో పనులు మంజూరయ్యాయి. తొలుత కొన్నివారాలపాటు బిల్లులు వెంటవెంటనే పడ్డాయి. దీంతో ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు పోటీపడి పనులు దక్కించుకున్నారు. అప్పులు చేసి.. వాటిని పూర్తి చేశారు. తర్వాత నెలలు గడుస్తున్నా.. బిల్లులు కాక వారికి చుక్కలు కనబడుతున్నాయి. చాలామంది అప్పులపాలై అల్లాడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. మండల, గ్రామస్థాయి నాయకులు వాటిని చేపట్టారు. పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా బిల్లులు అందడంలేదు. వెంటనే ఇప్పించాలని ముఖ్య నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. చెల్లింపులో జాప్యం అవుతుండటంతో కొత్తగా పనులు చేపట్టేందుకు ముందుకు రావట్లేదు.

అదే తీరు..

తెలుగుదేశం పార్టీ హయాంలో 2018-19లో కూడా పార్టీ నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ బిల్లులు ఆపేసింది. చాలా మంది అప్పులపాలై ఊర్లు వదిలారు. కొంతమంది కోర్టును ఆశ్రయించి ఎంతో కొంత దక్కించుకున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో పాత బిల్లులు చెల్లిస్తారని నాయకులు ఆశపడ్డారు. చాలామందికి ఇప్పటికీ చెల్లించలేదు. దీనికితోడు పల్లె పండుగలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులుచేసి అప్పుల పాలయ్యామనీ, వడ్డీలు కట్టలేకపోతున్నామని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పనులు వద్దు బాబోయ్..

నియోజకవర్గంలో రూ.20కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. హిందూపురం మండలంలో రెండో విడత పనులు ఇచ్చినా ఇప్పటికీ కొన్నిచోట్ల ప్రారంభం కాలేదు. బిల్లులు రాకపోవడమే ఇందుకు కారణం. పెనుకొండ నియోజకవర్గంలో కూడా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తే చాలనీ, కొత్తవి వద్దు అంటూ నాయకులు తెగేసి చెబుతున్నారు. ఏది ఏమైనా అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు, కూటమి నాయకులు వైసీపీ హయాం మాదిరిగా ప్రస్తుతం కూడా వెనుకడుగు వేస్తున్నారనడంలో సందేహం లేదు.



పూలకుంటలో పూర్తయిన రోడ్డు నిర్మాణం

పంట నమో...దు!

- నత్తనడకన ప్రక్రియ..
- ముంచుకొస్తున్న గడువు
- సిబ్బంది నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు (వివరాలు 6లో...)

అన్నదాతలను మింగిన అప్పులు

వేర్వేరుచోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య (7లో...)

డీఎస్సీలో నకిలీల కలకలం..!

వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం

ఈడబ్ల్యూఎస్ కోటాలో బోగస్ పత్రాలు

ఆధారాలతో ఫిర్యాదులు

రెవెన్యూ అధికారుల అండ

ఆందోళనలో అర్హులు

7 లో

పర్యావరణం



గణపతి కరిగిన నీట..
గంగమ్మ కరుణకై వేట..!

ఊరి చివర..
ఉత్సవం ముగిసిన చోట..
ఉపాధి కోసం పేదల వేట..!

ఒక్కందుకు కటిక పేదరికమూ
మంచిదే అంటారేమో..!
ఇది పొట్టకూటి కోసం
చేసే రణం కాదు..
పర్యావరణ హితం..
అని సుద్దులు చెబుతారేమో..!

దిక్కులేని వారికి
దేవుడే దిక్కు అంటే ఇదేనేమో..!
ఈ రూపంలో బొజ్జ గణపతి
ఈ పేదల పొట్ట నింపుతున్నాడేమో!

స్వామి..
నువ్వు మునిగిన నీట
వీరు మునుగుతున్నారు కదా..
ఇంక పేదరికపు శాపం నుంచి
విముక్తి కలిగించు..!



ఇదిగో.. వింటున్నావా.. టెంకాయ
దొరికింది.. రేపు చట్నీ చేసుకుందాం



ఏరినవన్నీ అమ్మేసి సన్న బియ్యం ప్యాకెట్ తెచ్చుకుందాం..
బువ్వ ఇట్ల కమ్మగా ఉంటుంది..!



పాపం పెద్దాయన..!
ఏదైనా ఖరీదైనది దొరికితే బాగుండు..

(అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి సమీపంలో..)

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పనికొచ్చేవన్నీ ఏరుకుందాం..
అమ్మేసి పండుగ చేసుకుందాం..



చెత్త నుంచి సంపద సృష్టి..
ఇలా కూడా..!

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్



కెప్టెన్‌గా వ్యవహరించనున్న వీరారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్ అండర్-19 నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. టోర్నీకి మధ్యప్రదేశ్, బరోడా, ఆంధ్రా ప్రెసిడెంట్ ఎలెవన్, ఆంధ్రా సెక్రటరీ ఎలెవన్ జట్లు ప్రాతినిథ్యం వహించనున్నాయి. ఆంధ్రా ప్రెసిడెంట్ ఎలెవన్ జట్టుకు జిల్లా క్రీడాకారుడు కేహెచ్ వీరారెడ్డి కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇప్పటికే ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 11వతేదీ వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో
జాబ్‌మేళా

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు వస్తున్నారని, జిల్లాకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ ఏ బ్రాంచ్‌లలోనైన పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లతో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణనందు హాజరు కావాలని వివరించారు. ప్రతి ఒక్కరూ రెజ్యూమ్, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9182920381 నెంబరకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

సూపర్ సిక్స్... సూపర్ హిట్!

- 15 నెలల్లో పథకాలు విజయవంతంగా అమలు
- 10న అనంతలో బహిరంగ సభ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- మంత్రి పయ్యావుల కేశవ్
- పవన్ కల్యాణ్ కూడా వస్తారు..: జనసేన
- ఏర్పాట్లపై కూటమి నేతల సమావేశం
- సభాస్థలం పరిశీలన



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నేతలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 15 నెలల్లోనే సూపర్ సిక్స్ పథకాలను సూపట్ హిట్ అయ్యేలా చేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈనెల 10న సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో అనంతలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 3.50 లక్షల మంది ప్రజలు కలుస్తారని, ఇందులో ఏకంగా లక్ష మంది మహిళలే ఉంటారని ఆయన స్పష్టం చేశారు. అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఉమ్మడి జిల్లా పార్టీ పరిశీలకుడు కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జనసేన, బీజేపీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎం పదవి చేపట్టి 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులు, ప్రజల తరపున సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత ఈనెల 10వ తేదీ 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బహిరంగ సభ నిర్వహణ స్థలం ఎంపిక, ఏర్పాట్లు తదితర అంశాలపై గంటన్నరపాటు చర్చించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్‌గా అమలు చేశామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సాగిందన్నారు. ఇప్పుడిప్పుడే ఏపీ కోలుకుంటోందన్నారు. రాష్ట్రంలో గణనీయమైన మార్పు మొదలైందన్నారు. లా అండ్ ఆర్డర్ అద్భుతంగా అమలవుతోందన్నారు. అన్నివర్గాల ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నారన్నారు. తమకు నచ్చిన పని చేసుకుని బతుకుతున్నారన్నారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈనెల 10వ తేదీ అనంతపురంలో సూపర్ సిక్స్-సూపర్‌హిట్ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర పరిధి జీఎంఆర్ ఇంద్రప్రస్థ స్థలంలో సభ నిర్వహించేలా ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయానికి వచ్చామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య సభ ఉంటుందన్నారు. పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్నారు. అందరూ సహకరించి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు కూడా..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు అద్భుతంగా అమలవుతున్నాయన్నారు. వైసీపీ అనవసరంగా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు అందరికీ పథకాలు అమలవుతున్నాయన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనసేన నాయకుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ... ఏపీలో సూపర్ సిక్స్ పథకాలు చక్కగా అమలు చేస్తున్నారన్నారు. సభకు తమ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం హాజరవుతారని తెలిపారు. తర్వాత కొత్తగా అనంతపురం జిల్లాకు మంజూరైన అంబులెన్స్‌ను మంత్రులు టీజీ భరత్, పయ్యావుల కేశవ్, సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. వారంతా జీఎంఆర్ ఇంద్రప్రస్థ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, టీడీపీ అనంత, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అంజినప్ప, నేతలు పరిటాల శ్రీరామ్, శ్రీధర్ చౌదరి, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులు, పల్లె రఘునాథరెడ్డి, రాయల్ మురళి, జనసేన నాయకులు మధుసూదన్, బీజేపీ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్షరం అండగా.. పరిష్కారం వడివడిగా..!

(5వ పేజీ తరువాయి)

మంగళవారం ఉదయం 10 గంటలకు కొత్తచెరువులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సక్సెస్ మీట్ నిర్వహిస్తున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితోపాటు జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరుకానున్నారు.

పరిష్కారం దిశగా..

- ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణానికి జూలై 10న కొత్తచెరులో మెగా పేరెంట్ మీటింగ్‌కు హాజరైన సీఎం చంద్రబాబు రూ.రెండు కోట్లు మంజూరు చేశారు.



బీసీ కాలనీలోని ఎల్2 లేఅవుట్‌లో విద్యుత్ లైన్ ఏర్పాటుకు తెప్పించిన స్తంభాలు



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమంలో పాల్గొన్న జనం (ఫైల్)

- కొత్తచెరువులో శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి సర్వే నంబరు 1451లోని 1, 2, 3 లెటర్లలో 3.70 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి పంచాయతీకి అప్పగించారు.
- బీసీ కాలనీలోని ఎల్-2, ఎల్-3 లేఅవుట్లలో విద్యుత్ లైన్, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.10.60 లక్షలతో స్తంభాల ఏర్పాటు, బోర్ల తవ్వకానికి ప్రతిపానదనలు పంపారు.
- విజయనగర్ కాలనీలో రాముల ఆలయం వద్ద రూ.60 వేలతో తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేశారు.
- వేణుగోపాల్ నగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి రూ.40లక్షలతో పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు చేసింది.
- కొత్తచెరువులోని నాలుగు రోడ్ల కూడలిలో డివైడర్లపై తోపుడు బండ్లను పోలీసు శాఖ తొలగించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించింది.
- పెనుకొండ రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పొలాల్లోకి దారి లేకుండా పోయిందని రైతులు విన్నవించారు. సమస్య పరిష్కారానికి రైల్వే శాఖ రూ.2 కోట్లతో రోడ్డు పనులు చేపట్టింది.
- దర్గా వీధిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి గ్రామీణ నీటిసరఫరా, పంచాతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రూ.10లక్షలతో పైపులు ఏర్పాటు చేస్తున్నారు.
- బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ రూ.12 లక్షలతో నిర్మించారు.



బీసీ కాలనీలోని ఎల్2 లేఅవుట్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీ కాలువలు



కొత్తచెరువులో శ్మశాన వాటికకు కేటాయించిన భూమి

వయోజన విద్య సూపర్‌వైజర్
పోస్టులకు నోటిఫికేషన్

- 8 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 12న ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వయోజన విద్య శాఖలో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, వయోజన విద్యాశాఖ డీడీ వెంకటేశులు వెల్లడించారు. ఉమ్మడి అనంతజిల్లాలో కదిరి డివిజన్‌లో ఒకటి, పెనుకొండ డివిజన్‌లో ఒకటి సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ రెండు పోస్టులకు ప్రభుత్వ టీచర్ల నుంచి భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీ టీచర్లు, పీఈటీలు, గ్రేడ్-2 భాషా పండితులు ఇందుకుఅర్హులు అన్నారు. 45 ఏళ్లలోపు ఉండి కనీసం పదేళ్ల అనుభవం ఉన్న వారు ఈ పోస్టులకు ఈనెల 8వతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ఇన్నోవేషన్ మారథాన్‌లో నమోదు కావాలి

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల తప్పనిసరిగా నమోదుకావాలని డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్‌సెంటర్ క్యూరేటర్ బాలమురళి సోమవారం ప్రకటనలో ఆదేశాలు ఇచ్చారు. దీనిని కేంద్ర విద్యాశాఖ, సైన్స్ పరిశోధన సంస్థ సంయుక్తంగా పిల్లల్లో సైన్స్ పట్ల జిజ్ఞాస పెంచడానికి ఏర్పాటు చేశాయన్నారు. ఇందులో ప్రతిపాఠశాల మంగళవారంలోగా నమోదు కావాలని పేర్కొన్నారు. కనీసం 50 మంది విద్యార్థులను బృందంగా ఏర్పాటు చేసి ఆవిష్కరణలను తయారు చేయించాలని తెలిపారు. అనుమానాలు ఉంటే జిల్లా సైన్స్‌సెంటర్ క్యూరేటర్‌ను సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠ ధర రూ.14, సరాసరిధర రూ.19తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.18వేలు

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 668 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పంట నమో...దు!

నత్తనడకన ప్రక్రియ.. ముంచుకొస్తున్న గడువు

- సిబ్బంది నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఈ పంట నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పంటల బీమా, పంట నష్టపరిహారం తోపాటు ఇతర రకాల లబ్ధి పొందాలంటే ఈ పంట నమోదే కీలకం. అలాంటి ప్రక్రియపై పలువురు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపమూ ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జూలై మూడో వారంలో ఈ పంట నమోదు మొదలైంది. ఈనెల 15వ తేదీ వరకు గడువు విధించారు. 19 నుంచి 24వతేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, ముసాయిదా ఈ పంట జాబితాను ప్రదర్శించాలని నిర్ణయించారు. 25వ తేదీ నుంచి 28 వరకు ఈ పంట జాబితాపై అభ్యంతరాలు, అర్జీలు స్వీకరించనున్నారు. 30వతేదీ ఈ పంట తుది జాబితాను విడుదల చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

14 రోజులే గడువు..

ఖరీఫ్‌లో ఈ పంట నమోదుకు 14 మాత్రమే గడువు ఉంది. అయినా.. పంట నమోదులో పలు మండలాల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటి దాకా 2.21 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 71,972, కంది 82,257 హెక్టార్లల్లో వేశారు. మిగతా విస్తీర్ణంలో మొక్కజొన్న, ఆముదం, పత్తి, వరి, జొన్న తదితర రకాల పంటలు సాగు చేశారు. గతనెలలో కురిసిన వర్షాలకు జిల్లాలో కంది, ఇతర రకాల పంటలు పెట్టారు. వ్యవసాయ శాఖ పరంగా ఇప్పటి దాకా జిల్లావ్యాప్తంగా 1.30 లక్షల ఎకరాల్లో మాత్రమే ఈ పంట నమోదు చేశారు. పలు మండలాల్లో సంబంధిత ఏఓలు ఈ పంట చేయాల్సిన రైతుల జాబితాను డౌన్‌లోడ్ చేసి సంబంధిత రైతు సేవాకేంద్రం సిబ్బంది, ఎంపీఈఓలకు కేటాయించడం లో తీవ్ర జాప్యం చేశారు. మరికొన్ని మండలాల్లో జాబితాను సిబ్బందికి కేటాయించినా క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. పలు రైతు సేవాకేంద్రాల పరిధిలో ఎక్కువ విస్తీర్ణం ఉన్నా.. తక్కువ మంది సిబ్బంది ఉండటంతో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఈ పంట నమోదు చేయడంలో నానా తంటాలు పడుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదని తెలిసింది.

34,318 ఎకరాలే..

ఉద్యాన పంటల నమోదులోనూ సంబంధిత అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.25 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఇప్పటిదాకా 34,318 ఎకరాల్లో మాత్రమే ఈ పంట నమోదు చేయడంతో సరిపెట్టడం గమనార్హం. ఇప్పటిదాకా అరటి 5,434, చీనీ 14,279, మామిడి 4,101, దానిమ్మ 2,550, బొప్పాయి 413 ఎకరాలు, మరో 527 ఎకరాల్లో ఇతర రకాల పండ్ల తోటలు నమోదు చేశారు. కూరగాయ పంటలు 5,081, తోట పంటలైన కొబ్బరి, వక్క 521, సుగంధ ద్రవ్యాలు 1,276, పూల తోటలు 136 ఎకరాల్లో నమోదు చేశారు. జిల్లాలోని ఆరు మండలాల్లో 400 ఎకరాల్లో ఆయిల్ పాం సాగవుతోంది. ఇప్పటి దాకా ఆయిల్ పాం పంట ఈ పంట నమోదు చేయలేదు. ఈసారి తోటల్లో గట్టు మీద పెంచే కొబ్బరి, తాటిచెట్లు, చింత, అల్ల నేరేడు ఇతర రకాల చెట్లను ఈ పంట నమోదు చేయాలన్న నిబంధన విధించారు. గట్లపై పెంచే ఉద్యాన చెట్ల సంఖ్యను ఈ పంటలో నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియపైనా పలు ప్రాంతాల్లో సిబ్బంది జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు..

ఈ పంట నమోదు ప్రక్రియలో పలు రకాల సాంకేతిక సమస్యలతో సిబ్బంది ఇక్కట్లు పడుతున్నట్లు సమాచారం. జియో కోఆర్డినేట్స్ ద్వారా పొలంలో రైతును నిలుచోబెట్టి ఫొటో తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గతేడాది 50 మీటర్ల దూరం వరకు జియో కోఆర్డినేట్స్‌తో ఫొటో తీసేందుకు అవకాశం ఉండింది. ఈసారి 5.1 వర్షన్‌లో 20 మీటర్ల దూరానికి కుదించారు. వరి పంటకు మాత్రమే 50 మీటర్ల దూరం వరకు అవకాశం ఇచ్చారు. మిగతా పంటలకు 20 మీటర్లే ఇచ్చారు. మూడేళ్ల క్రితం వరికి 200 మీటర్లు, ఇతర పంటలకు 100 మీటర్ల దాకా జియో కోఆర్డినేట్స్‌తో ఫొటో తీసే వెసులుబాటు కల్పించారు. ఏడాదికేడాదికీ ఈ పరిధిని తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో సిబ్బంది ఫొటోలు తీయడంలో ఇబ్బంది పడుతున్నారు. గతంలో పంట సాగుచేసిన పొలాల్లో మాత్రమే ఈ పంట నమోదు చేస్తూ వచ్చారు. ఈ ఏడాది సరికొత్తగా పంటలు సాగు చేయని పొలాలను సైతం నమోదు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. పంట సాగుచేసిన పొలంతోపాటు బీడు భూములను నమోదు చేయడం ఇబ్బందిగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని డీ పట్టాలు, రీ సర్వే చేసిన గ్రామాల్లోని భూములు యాప్‌లో కనిపించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని డీ పట్టా భూములు, రీసర్వే చేసిన గ్రామాల్లో ఈ పంట నమోదు ఆగిపోయింది. సాంకేతిక సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపడితేనే ఈ పంట నమోదు సవ్యంగా సాగే పరిస్థితి ఉంది. లేదంటే సకాలంలో పూర్తి చేయడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఏమేరకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.



ఉద్యాన తోటల్లో ఈ పంట నమోదు చేస్తున్న సిబ్బంది

చెరువులో పడి యువకుడి మృతి


బత్తా మహేశ్ (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన బత్తా మహేశ్(36) ఆదివారం నిమజ్జనానికి వెళ్లాడు. నిమజ్జనంలో ముఖంపై, శరీరంపై పడిన రంగులను శుభ్రంచేసుకోవడానికి సోమవారం ఉదయం ధర్మవరం మొదటి మరువ వద్దకు వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు చెరువు వద్ద రంగులు పోవడానికి కడుక్కొంటుండగా కాలు జారీ చెరువులో పడ్డాడు. చెరువులో నీటి బురదలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. చేపల పట్టడానికి వెళ్లిన వారికి మృతదేహం కనిపించడంతో డయల్ 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తన సిబ్బందితో చెరువు వద్దకు వెళ్లి అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. మద్యాహ్నం 2గంటల సమయంలో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు నిహాన్ ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు..


చిన్న పులికొండ (ఫైల్)

గుత్తిరూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిన్న పులికొండ (45) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిన్న పులికొండ గత నెల 24న నంద్యాల జిల్లా ప్యాపిలికి వెళ్లి ఇంటికి బైక్ వస్తుండగా ప్యాపిలి వద్ద బైక్‌ను బొలెరో వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ప్యాలిపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని గొర్రెల కాపరి..

కనగానపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట పుట్టకనుమ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక గొర్రెల కాపరి మృతి చెందగా.. మరో కాపరి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. కొండపల్లికి చెందిన బంగి నరసింహులు(50) సోమవారం తగరకుంటకు వెళ్లాడు. అక్కడి నుంచి కంబదూరు మండలం బాలవెంకటాపురం గ్రామానికి చెందిన గొర్రెల యజమాని ముత్యాలప్పతో కలసి.. కంబదూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. ఈ క్రమంలో భానుకోట వైపు నుంచి ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో నరసింహులు, ముత్యాలప్ప తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరసింహులు మృతిచెందగా, ముత్యాలప్పను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. నరసింహులుకు భార్య నారాయణమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలపై రైతుల ఆగ్రహం


దుకాణం వద్ద మొక్కజొన్న కంకులతో నిరసన తెలుపుతున్న రైతులు

తాడిపత్రి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీ రోడ్డులోని ఒక దుకాణంలో నకిలీ విత్తనాలు పంపిణీ చేశారని కడప జిల్లా ముద్దనూరు మండలం శెట్టివారిపల్లికి చెందిన రైతులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం తమ గ్రామానికి చెందిన 30 మంది రైతులు వచ్చి మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశామని తెలిపారు. అదును వచ్చినా మొక్కజొన్న కంకుల్లో విత్తనాలు రాకపోవడంతో యాజమానికి పలుసార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఎకరాకు 40 క్వింటాళ్లు మొక్కజొన్న పంట పండుతుందని నమ్మకంతో ఇక్కడికి వచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తే.. కనీసం ఎకరాకు ఐదుక్వింటాళ్లు కూడా పండే పరిస్థితి లేదని వాపోయారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని, తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రూ.32 కోట్లతో పంచాయతీ భవనాల నిర్మాణం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆర్‌జీఎస్‌ఏ (రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్) కింద రూ.25 కోట్లు, ఎన్‌ఆర్ఈజీఎస్ కింద మరో రూ.7 కోట్లు కేటాయించే విధంగా అంచనాలు తయారు చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు. ఇప్పటికే జిల్లాలో 27 పంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టేలా జాబితా తయారు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నూతన ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడు బాధ్యతలు చేపడుతుండటంతో.. ఇంజనీర్లు మొత్తం సమావేశమయ్యే అవకాశం ఉంది. అందులో భాగంగా దీనిపై సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో జిల్లాలోని పలు పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాణం చేపట్టనున్నారు.

బాలికపై అత్యాచారం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలికపై నరేష్ అనే యువకుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి వెనుక వైపున ఉన్న బాలిక ముఖంపై నరేష్ చున్నీతో చుట్టివేసి, అరవకుండా గట్టిగా నోట్లో గుడ్డ కుక్కాడు. ఆ తరువాత బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కోసం తల్లిదండ్రులు వెతుకుతుండగా గమనించిన నరేష్ పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నరేష్‌పై పోక్సో, అత్యాచారం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టూటౌన్ సీఐను సస్పెండ్ చేయాలి

48 గంటలు న్యాయవాదుల విధుల బహిష్కరణ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): న్యాయవాదితో దురుసుగా ప్రవర్తించిన, దాడి చేసిన టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను సస్పెండ్ చేయాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. గతనెల 29న న్యాయవాది సాయి ప్రసాద్‌తో సీఐ దురుసుగా ప్రవర్తించడంపై సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, ప్రధానకార్యదర్శి వెంకట్రాముడు, ఇతర న్యాయవాదులు నిరసనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది సాయి ప్రసాద్ ఎలాంటి నేరం చేయకుండానే, గత నెల 29వ తేదీ ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద ఒక నేరస్తుడితో వ్యవహరించినట్టు సీఐ దురుసుగా మాట్లాడారన్నారు. అంతేకాకుండా బలవంతంగా స్టేషన్‌కు తరలించాడన్నారు. న్యాయవాదిలో అమానుషంగా ప్రవర్తించిన సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. లేకుంటే ప్రైవేట్ కేసు వేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. రెండు రోజులపాటు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్టు తీర్మానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, నరసింహులు, ధర్మసింగ్, బీమన్న, నల్లప్ప, గోవిందరాజులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డీఎస్సీలో నకిలీల కలకలం..!

- వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం
- ఈడబ్ల్యూఎస్ కోటాలో బోగస్ పత్రాలు
- ఆధారాలతో ఫిర్యాదులు
- అక్రమార్కులకు రెవెన్యూ అండ
- ఆందోళనలో అర్హులు


వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాలలో నకిలీలు చొరబడినట్లు పెద్దఎత్తున విమర్శలు రావడంతో కలకలం రేగుతోంది. నకిలీల మోసాలపై అర్హులైన అభ్యర్థులు అధికారులకు ఆధారాలతో ఫిర్యాదులు చేస్తుండడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. ప్రధానంగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్) ఓసీ కుటుంబాలకు ఈ కోటాకింద ఉద్యోగాలు ఇస్తారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలో అధికంగా బోగస్‌వి పుట్టించుకున్నారు. రెవెన్యూ శాఖలో కొందరు అమ్యామ్యాలకు పాల్పడి, మరికొందరు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల మేరకు కుటుంబానికి ఐదెకరాలు మెట్ట భూమి ఉంటేనే అర్హులు. కానీ రెవెన్యూ యంత్రాంగం మాయాజాలం చూపించి అధికభూములు ఉన్నా లేవని ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీచేస్తోందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఆరోపణల్లో కొన్ని..

తాడిపత్రి పట్టణానికి చెందిన ఓ అభ్యర్థి డీఎస్సీలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టుకు ఎంపికయ్యాడు. ఈయనది కడప జిల్లా కొండాపురం మండలం. తాడిపత్రిలో నివాసముంటూ ఇక్కడే చదివి లోకల్‌గా ఇప్పుడు పోస్టు దక్కించుకున్నాడు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇతడి తండ్రి(లేట్)పేరు మీద 8.67 ఎకరాలు, తల్లి పేరు మీద 2.66 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ అభ్యర్థికి తాడిపత్రి రెవెన్యూ అధికారులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను జారీ చేశారని ఆధారాలతో బయటపెట్టారు. శెట్టూరు మండలానికి చెందిన ఓ అభ్యర్థి కూడా డీఎస్సీలో పీడీగా ఎంపికయ్యాడు. ఈయన ఈడబ్ల్యూఎస్ కోటా కిందనే ఎంపిక కావడం వివాదం రేపుతోంది. అభ్యర్థి పేరుమీద మూడు ఎకరాలు, ఆయన తండ్రి పేరు మీద ఆరు ఎకరాలు, అన్న పేరు మీద 3.58 ఎకరాలు భూములు ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేలో వీరందరూ ఉమ్మడి కుటుంబంగా చూపుతోంది. కానీ ఈ అభ్యర్థికి రెవెన్యూ అధికారులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. కదిరి ప్రాంతంలో ఓ అభ్యర్థి పీహెచ్ కింద సదరం సర్టిఫికెట్‌తో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ పొందుతూ వచ్చారట. డీఎస్సీలో దరఖాస్తు చేసుకొని పీడీ (ఫిజికల్ డైరెక్టర్) పోస్టు కొట్టారట. డీఎస్సీ నిబంధనల మేరకు పీహెచ్‌లు పీడీ పోస్టులకు అనర్హులు. అయినా ఇన్నేళ్లు పీహెచ్ సదరం సర్టిఫికెట్‌తో పింఛన్ తీసుకుంటూ ఇపుడు డీఎస్సీలో సాధారణ వ్యక్తిగా ఉద్యోగం పొందడంపై తీవ్రచర్చసాగుతోంది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇతర మెడికల్ సర్టిఫికెట్లపైనా ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమార్కులకు రెవెన్యూ సహకారం

ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలనే ఆశతో అభ్యర్థులు అడ్డదారుల తొక్కుతున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకారం అందిస్తున్నారు. ఇందుకు తాడిపత్రి అభ్యర్థి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెటే నిలువెత్తు నిదర్శనం. ఈ అభ్యర్థి తండ్రి చనిపోయాడు. ఆయన ఒకడే కొడుకు, తల్లితో కలిసి ఉంటున్నాడు. కొండాపురం మండలంలో తండ్రికి 8.67 ఎకరాలు, తల్లికి 2.66 ఎకరాల భూమి ఉంది. తాడిపత్రిలో నివాసం ఉంటూ ఇక్కడ తమకు భూమిలేదని చూపించుకున్నారు. 1-బీ అడంగల్‌లోను, ఈసీ కోరగా అందులోను ఈ భూములు ఉన్నట్లు రికార్డుల్లో కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులకు డబ్బులు ముట్టచెప్పి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందుతున్నారని తెలుస్తోంది. వీటి వల్ల నష్టపోతున్న బాధిత అభ్యర్థులు నకిలీ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై ఆధారాలు సేకరించారు. ఈ మేరకు సోమవారం బాధిత అభ్యర్థులు కలెక్టరు వినోద్‌కుమార్, డీఈఓ ప్రసాద్‌బాబును వేర్వేరుగా కలిసి ఆధారాలతో ఫిర్యాదులు ఇచ్చారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న తాడిపత్రి అభ్యర్థి సైతం డీఈఓను కలిసి తమకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇదిగో అంటూ అందజేసి వెళ్లాడు. డీఎస్సీలో నకిలీల వ్యవహారాలు బయట పడుతుండడంతో ఇటు అధికారులు, అటు అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జాబితా మొత్తం రాష్ట్రశాఖనే ఎంపికచేస్తోందని, తమ చేతుల్లో ఏమీ లేదంటూ జిల్లా విద్యాశాఖ నిస్సహాయతను వ్యక్తం చేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి బోగస్‌లపై చర్యలు తీసుకుని నిజమైన ప్రతిభ అభ్యర్థులకు పోస్టులు దక్కేలా చూడాలని అభ్యర్థులు, వారికుటుంబసభ్యులు విన్నవించుకుంటున్నారు.

ఫిర్యాదులు వాస్తవమే



డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలపై పలు ఫిర్యాదులు వస్తున్న విషయం వాస్తవమే. కొందరు బాధిత అభ్యర్థులు ఆధారాలతో సహా తీసుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. వాటన్నింటిని తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి ఈ సర్టిఫికెట్లపై విచారణ చేయిస్తాం. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ఆ 50 మందికి నిరాశే..

విడుదలకాని డీఎస్సీ అభ్యర్థుల జాబితా

5న తుది జాబితా అంటున్న రాష్ట్రశాఖ

అనంతపురం విద్య(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చెలగాటమాడుతున్నారు. మెరిట్ లిస్టు ఇచ్చి సెలెక్షన్ జాబితా పూర్తి స్థాయిలో విడుదల చేయడంలేదు. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు అభ్యర్థుల సెలెక్షన్ జాబితా ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికి రెండు విడతలలో 757 మంది పేర్లు విడుదల చేసి వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. మిగిలిన 50 మంది సెలెక్షన్ అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటిస్తామని, మెసేజ్‌లు వస్తాయని రాష్ట్ర శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు మెసేజ్‌లు, జాబితా కోసం ఎదురు చూశారు. సోమవారం మిగిలిన 50 మంది అభ్యర్థుల సెలెక్షన్ జాబితా విడుదల కాలేదు. ఎవరికీ మెసేజ్‌లు రాలేదు. రాత్రి పొద్దుపోయేవరకు కొందరు అభ్యర్థులు డీఈఓ కార్యాలయం వద్దే పడిగాపులు కాశారు. మరికొందరు ఫోన్లు చేస్తూ ఆరా తీశారు. జాబితా, మెసేజ్‌లు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశ చెందారు.

ఇదిలా ఉండగా.. సోమవారం రాష్ట్ర అధికారులు డీఎస్సీ సెలెక్షన్ ఫైనల్ జాబితా ఈనెల 5న ప్రకటిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులకు కాన్ఫరెన్స్‌లో చెప్పారు. ఇప్పటి వరకు జాబితా రాలేదు, వెరిఫికేషన్ పెండింగ్ ఉంది, మరో వైపు వివిధ రకాల ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ జాబితా ఎలా విడుదల చేస్తారో అర్థంకావడంలేదు. దీంతో అభ్యర్థుల్లో మరింత టెన్షన్ మొదలైంది.

పూలకుంటలో అర్ధరాత్రి చోరీ

6 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీ


వివరాలు ఆరాతీస్తున్న సీఐ

గుమ్మఘట్ట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామ శివారులో ఆదివారం అర్ధరాత్రి రైతు గంగిరెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి ఆరుతులాల బంగారం, రూ. రెండు లక్షల నగదు దోచుకెళ్లారు. గ్రామ శివారులో గంగిరెడ్డి, ఉషారాణి దంపతుల ఇల్లు ఉండగా దొంగలు అర్ధరాత్రి చొరబడి బీరువా పగులగొట్టి అందులోని ఉంగరం, కమ్మలు, ఒక చైనుతో పాటు ఆమె మెడలో మూడు తులాల మంగళసూత్రం సైతం తెంచుకొని పరారయ్యారు. ఇందుకు సంబంధించి గంగిరెడ్డి, ఉషారాణి దంపతులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ఉషారాణి ఇంట్లో నిద్రిస్తుండగా.. భర్త గంగిరెడ్డి ఇంటి బయట తలుపులు అడ్డం పెట్టుకొని మంచంపై నిద్రిస్తున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి ఉషారాణి గొంతులో మంగళసూత్రం తెంచుతుండగా మెలకువ వచ్చి కేకలు వేయగా ఇద్దరు దొంగలు పారిపోయినట్లు చెప్పారు. ఇంట్లో బీరువా తెరుచుకొని ఉందని, అందులో బంగారు కమ్మలు, ఉంగరం, చైనుతో పాటు కుమారుడి పెళ్లి కోసం దాచి ఉంచిన రూ. రెండు లక్షల నగదు కనిపించలేదని పోలీసులకు వివరించారు. ఘటనపై రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్యతో పాటు వివిధ మండలాలకు చెందిన ఎస్ఐలు, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌ను రప్పించి విస్తృత తనిఖీలు చేపట్టారు. దొంగలు వినియోగించిన పాత ద్విచక్రవాహనం గ్రామశివారులో వదిలి పరారైనట్లు డాగ్‌స్క్వాడ్ ద్వారా గుర్తించారు. బండి రికార్డుల ఆధారంగా రంగసముద్రం గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన వాహనంగా తెలిసింది. పొలం వద్ద వదిలిన వాహనాన్ని దొంగలు చోరీకి వినియోగించినట్లు రైతు పోలీసులకు తెలిపారు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

రూ.3 కోట్లు వృథా..!

జగనన్న లేఅవుట్‌లో ప్రజాధనం కుమ్మరింత

కోట్ల రూపాయలతో పనులు

భూమి అనువైంది కాదని ముందుకురాని లబ్ధిదారులు

ఇళ్లు కట్టుకునేందుకు ససేమిరా


లేఅవుట్‌లో నాటిన హద్దుల రాళ్లు


లేఅవుట్‌లో రోడ్లకు వేసిన ఎర్రమట్టిని తీసుకెళ్లిన దృశ్యం

అనంతపురంరూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రూపాయి ఖర్చు చేయాలంటే.. ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. అధికారులైతే మరింతగా లెక్కలు వేసి ఖర్చు చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాత్రం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కామారుపల్లి సమీపంలో జగనన్న లేఅవుట్‌లో నిధులు కుమ్మరించారు. అప్పటి పాలకుల మెప్పు కోసం.., కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికి కొందరు అధికారులు ప్రజాధనాన్ని మంచి నీళ్లలా ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు భూమి అనువైంది కదాని లబ్ధిదారులు అయిష్టత కనబరిచారు. చేసేదిలేక అప్పటి ప్రజాప్రతినిధులు సైతం లేఅవుట్ వద్దనేశారు. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది.

150 ఎకరాల్లో లేఅవుట్

గత ప్రభుత్వంలో కామారుపల్లి వద్ద జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేశారు. గ్రామ పరిధి సర్వే నంబర్లు 186, 187, 188,200,201 నుంచి 204, 214 నుంచి 217, 369లో 152.54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో లేఅవుట్ వేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అప్పటి పాలకులు, అధికారులు నిర్ణయించారు. ఇసుక, సవుడు భూమి కావడంతో ఇళ్ల నిర్మాణాలకు భూమి అనువైంది కాదన్న అభిప్రాయాలు అప్పట్లోనే వినిపించాయి. అప్పటి ఉన్నతాధికారులు కేవలం ప్రజాప్రతినిధుల మెప్పుకోసం హడావుడిగా పనులు చేశారు. అనంతపురం నగరంతోపాటు మండలంలోని కొన్ని ప్రాంతాల లబ్ధిదారులకు 7,308 ప్లాట్లు కేటాయించారు. ఆ మేరకు పట్టాల పంపిణీ పెద్ద ఎత్తున చేపట్టారు. లబ్ధిదారులు వచ్చి తమకు కేటాయించిన స్థలాలను చూసుకున్నారు. ఇళ్ల నిర్మాణం సాధ్యం కాదనీ, ఒక వేళ చేపట్టినా ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పునాదులకు కూడా సరిపోదని తెలియడంతో లబ్ధిదారులు స్థలాలు వద్దనేశారు. ప్రజాప్రతినిధులు చేసేదిలేక లబ్ధిదారులకు ఓటేశారు.

కోట్లు ఖర్చు..


లేఅవుట్ ఏర్పాటుకు అప్పటి అధికారులు ప్రజాధనాన్ని కోట్లలో ఖర్చు చేశారు. లేఅవుట్‌లో ఎర్రమట్టితో రోడ్ల ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం కింద రూ.80 లక్షలకు పైగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగ, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ.50 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. 150 ఎకరాలు చదును చేయడానికి, ప్లాట్ల విభజనకు, హద్దు రాళ్ల నాటేందుకు, ఇతరత్రా వాటికి రూ.కోటికిపైగానే వెచ్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా రూ.3కోట్ల మేర ప్రజాధనాన్ని లేఅవుట్ కోసం వినియోగించారు. ఇంకా నగరంలో నుంచి లేఅవుట్‌కు రావడానికి వందల రుపాయాలు లబ్ధిదారుల ఖర్చయింది.

వైసీపీ నాయకులకే లబ్ధి..

లేఅవుట్‌తో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ఇందులో లాభపడింది కాంట్రాక్టర్లే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో కాంట్రాక్టును వైసీపీ నాయకులే దక్కించుకుని లాభపడ్డారు. ఇటీవల మరో వైసీపీ నాయకుడు లేఅవుట్‌లోని మట్టిని తరలించి, జేబులు నింపుకున్నాడు. లేఅవుట్‌లో ఉపాధి హామీ పథకం కింద ఎర్రమట్టిని తోలి, రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ రోడ్లను పెకలించి, మట్టి తరలించి సొమ్ము చేసుకున్నాడు. ఇది చూసిన జనం ముక్కున వేలేసుకున్నారు. గత ప్రభుత్వంలో లేఅవుట్ కాంట్రాక్టు దక్కించుకుని బాగుపడితే.. ఇప్పుడు కూడా అదే పార్టీకి చెందిన మరో నాయకుడు రోడ్లకు తోలిన మట్టిన అమ్ముకుని లాభపడుతున్నాడంటూ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

డైరెక్టర్, కమిషన్ సభ్యులుగా నియామకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు నాయకులకు డైరెక్టర్ పోస్టులు దక్కాయి. సోమవారం టీడీపీ అధిష్ఠానం పలువురికి డైరెక్టర్ పోస్టులను ప్రకటించింది. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాలలోకేష్ యాదవ్‌ను నియమించారు. కళ్యాణదుర్గం మండలానికి చెందిన ఓబుళాపురం బాల లోకేష్ యాదవ్‌కు ఈ అవకాశం కల్పించారు. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏపీ స్టేట్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులుగా శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన సాకే అనిల్‌కుమార్‌ను ప్రకటించారు. ఆయన 2009 నుంచి టీడీపీలో పనిచేస్తున్నారు. 2021 నుంచి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఎస్టీ కమిషన్ సభ్యులుగా ప్రకటించడంతో ఆనందం వ్యక్తం చేశారు.



మంత్రి నారా లోకేశ్‌తో బాలలోకేశ్ యాదవ్, అనిల్‌కుమార్

అన్నదాతలను మింగిన అప్పులు

వేర్వేరుచోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య


మండ్లి నాగేంద్ర (ఫైల్)

ధర్మవరంరూరల్/తాడిమర్రి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను అప్పులు మింగేశాయి. ఉమ్మడి అనంత జిల్లాలో వేర్వేరుచోట్ల ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ధర్మవరం మండలం ఆర్.యర్రగుంటపల్లికి చెందిన రైతు మండ్లి నాగేంద్ర (45) సోమవారం రాత్రి విషం తాగి మరణించాడు. రూరల్ పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు నాగేంద్ర తనకున్న ఐదెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. పొలంలో బోరు తవ్వించడానికి, వేరుశనగ, కాయగూరల పంటల సాగుకోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. పంటలు పండక, అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో కుటుంబీకులు లేని సమయంలో విషం తాగి, అపస్మారక స్థితిలో పడిపోయాడు. కాసేపటికి గమనించిన స్థానికులు హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నాగేంద్రకు భార్య బొజ్జమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

దాడితోటలో కౌలు రైతు..


తలారి రాజగోపాల్ (ఫైల్)

తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన కౌలు రైతు తలారి రాజగోపాల్(37) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కృష్ణవేణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజగోపాల్ గ్రామానికి చెందిన రైతుల భూమిని కౌలుకు తీసుకుని, అరటి సాగు చేశాడు. పంటలు సరిగా పండక అప్పుల పాలయ్యాడు. మరిన్ని అప్పులు చేసి గొర్రెల పెంపకం చేపట్టాడు. అందులో కూడా నష్టాలే ఎదురయ్యాయి. దీంతో అప్పులు రూ.6లక్షలు దాటాయి. వాటిని తీర్చే మార్గం కనిపించక ఆదివారం సాయంత్రం తాను కౌలు చేస్తున్న అరటి తోటలోనే పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులకు తోటకెళ్లారు. అక్కడ విగతజీవిగా పడివున్న రాజగోపాల్‌ను చూసి, బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. రైతుకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

రూ.లక్ష పలికిన వినాయకుడి లడ్డూ



లడ్డూను అందిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

ముదిగుబ్బ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా సోమవారం వేలం పాటలో లడ్డూ రూ.లక్ష పలికింది. నాలుగు కేజీల లడ్డూను గ్రామస్థులు గుర్రం కరుణాకర్, గుర్రం రాము రూ. 1,05,016కు దక్కించుకున్నారు. అదే విధంగా మూడు కేజీల లడ్డూను హర్ష టీం రూ.70 వేలకు, రెండు కేజీల లడ్డూను నితీష్ కుమార్ టీం రూ.50 వేలకు దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు వారిని శాలువతో సన్మానించి లడ్డూలను అందజేశారు.



వినాయక లడ్డూను దక్కించుకున్న కుళ్లాయప్ప

● ధర్మవరం: పట్టణంలోని 39వ వార్డు రాంనగర్‌లో ఆదివారం వినాయక లడ్డూకు వేలంపాట నిర్వహించగా, నామ కుళ్లాయప్ప అనే భక్తుడు రూ.63500 దక్కించుకున్నాడు. లడ్డూను దక్కించుకున్న నామకుళ్లాయప్ప ఉత్సవ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈద్గా ప్రహరీ నిర్మాణానికి చర్యలు

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోతుకుంట గ్రామ సమీపంలోని ఈద్గా మైదానంలో ప్రహరీ నిర్మాణానికి మదీనా మసీదు ముతవల్లి నాగూర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ ఈద్గా మైదానం ముళ్ల కంపలు, రాళ్లతో నిండిపోయింది. దీంతో నాగూర్‌హుస్సేన్‌తో పాటు స్థానిక ముస్లింలు రీగల్ అమానుల్లా, ఇస్మాయిల్, సలీంబాషా ఎక్స్‌కవేటర్ సాయంతో ముళ్ల కంపలను, రాళ్లను తొలగించి, ఈద్గా మైదానానికి ప్రహరీ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈద్గా మైదానంలో ముళ్ల కంపచెట్లు, రాళ్లతో అధ్వానంగా ఉండటాన్ని గుర్తించి శుభ్రం చేస్తున్నామని, ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు.

కార్మిక భవన నిర్మాణానికి విరాళం

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతమార్కెట్ పరిసర ప్రాంతాల్లో శ్రమజీవుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న కార్మిక భవన నిర్మాణానికి బీజేపీ నాయకుడు విరాళం అందజేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో ఈ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం బీజేపీనేత జూటూరు వెంకటేశ్ కార్మిక భవానికి రూ.10వేలు విరాళాన్ని మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు అందజేశారు.ఈ కార్యక్రమం లో పారిశుధ్య కార్మికసంఘం పట్టణ అధ్యక్షుడు మేకల బాబు, కార్యదర్శి ముకుంద తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా సాయికృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆగస్టు 31వ తేదీ పదవీ విరమణ పొందారు. దీంతో ధర్మవరం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఈఈగా సాయికృష్ణ విధులు కొనసాగిస్తున్న సాయికృష్ణకు ఉన్నతాధికారులు ఇంచార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో సాయికృష్ణ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

బంగారం చోరీపై ఫిర్యాదు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తన ఇంట్లో రెండుతులాల బంగారం చోరీ అయినట్లు మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో గుట్టూరు సల్లప్ప సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడ్డారని బాధితుడు తెలిపారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం ఆభరణాలు (కమ్మలు, మాటీలు) ఎత్తుకెళ్లినట్లు గుర్తించామన్నారు. అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రూరల్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించి విచారణ చేపడుతామని తెలిపారు.

రెండు వర్గాల ఘర్షణ

కదిరి అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని పట్నం గ్రామంలో సోమవారం రాత్రి రెండు వర్గాలు ఘర్షణ పడగా పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సూరి, వెంకటేష్ కుటుంబాల మధ్య పాతకక్షలతో ఘర్షణ పడ్డారని పోలీసులు, స్థానికులు తెలిపారు. ఈ ఘర్షణలో అశోక్, అరవింద్, నాని, సూరి, వెంకటేష్, శ్రీనివాసులు, చెన్నయ్య, అజంలికి గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. బాధితులు ఫిర్యాదుచేస్తే కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

● కారు స్వాధీనం.. నిందితుడి అరెస్టు

తనకల్లు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీకటిమానిపల్లి నుంచి బొంతలపల్లికి కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు తనకల్లు ఎక్సైజు సీఐ రాంప్రసాదు తెలిపారు. కదిరి పట్టణానికి చెందిన జి. శంకర అనే వ్యక్తి ఇండికా కారులో సుమారు రూ. 50వేల విలువైన 960 టెట్రా ప్యాకెట్లు, విస్కీ 86.4లీటర్లు తరలిస్తుండగా చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. కారుతోపాటు మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎంఎల్ తిప్పేస్వామి, జిలాని బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

నల్లచెరువు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమ్మవారిపల్లిలో వెలసిన గ్రామదేవత ఆలయంలో కానుకల హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పగలకొట్టి రూ.50వేలు నగదు దోచుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. మండలంలో వసరగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



హుండీని పగులగొట్టిన దృశ్యం

అపరిశుభ్రంగా...

● ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయం
● చుట్టూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం
● పట్టించుకోని అధికారులు



కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు



కార్యాలయం వద్ద చెత్తాచెదారం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ అండ్‌బీ ఈఈ కార్యాలయం అధ్వానంగా తయారైంది. నూతన భవనాలు కట్టించే ఆ శాఖ కార్యాలయంలో బూజుపట్టిన గదులు, అధ్వానంగా మరుగుదొడ్లు, ఆవరణం చుట్టూ పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్రత రాజ్యమేలుతున్నాయి. వర్షం వస్తే కార్యాలయంలోని గదులు కారుతున్నాయి. డివిజన్ పరిధిలోని ఈ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో పాటు సాంకేతిక విభాగం, సూపరింటెండెంట్, కార్యాలయ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రభుత్వ భవనాలను ఆ శాఖ అధికారులే పనులు చేపట్టి నిర్మిస్తుంటారు. అలాంటిది ఆ అధికారుల కార్యాలయమే అధ్వానస్థితికి చేరింది. కార్యాలయం సమీపంలోనే ఆర్అండ్‌బీ బంగ్లా ఉంది. చెత్తాచెదారంతో పాములు, విషపురుగుల సంచరించే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు. మరుగుదొడ్ల తలుపులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పైకి కార్యాలయం రంగులతో కనిపించినా లోపల అధ్వానం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు ఇక్కడ వర్తించవా అంటూ పలువురు పేర్కొంటున్నారు.



పెచ్చులూడిన భవనం పైకప్పు

ప్రతి మహిళ ఆర్థికవేత్త కావాలి

● ఇదే సీఎం ఆశయం: ఎమ్మెల్యే సింధూరరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి తదితరులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి నిరుపేద మహిళను ఆర్థికవేత్తగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఏపీజే అబ్దుల్‌కలాం షాదీమహల్ వరకు 900 మంది మహిళలతో కలసి 'సూపర్‌సిక్స్ సూపర్‌హిట్' భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి సోమవారానికి 30 ఏళ్లు పూర్తైన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఏకార్యక్రమం చేపట్టినా మహిళకు గుర్తింపు తెచ్చేందుకే అన్నారు. గతంలోనూ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు హయాంలో స్త్రీలకు ఆస్తిలో హక్కు, 33 శాతం రిజర్వేషన్లు వంటి కార్యక్రమాలను తెచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ఆదేబాటలో నడుస్తూ సీఎం చంద్రబాబు మహిళాశక్తిని ప్రపంచానికి చాటారన్నారు. అనంతరం నియోజకవర్గానికి సంబంధించి మహిళా సంఘాలకు డీఆర్డీఏ వెలుగుశాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ 84.24 కోట్ల బ్యాంకు లింకేజీ స్త్రీనిధి సొమ్ము చెక్‌ను వారి చేతుల మీదుగా పీడీ నరసయ్య అందజేశారు. ఆర్డీఓ సువర్ణ, ఆర్టీసీ డీఎం ఇనయతుల్లా, డీపీఎం పద్మావతి, అరుణ, ఏపీఎం పద్మావతి, మెప్మా సీఎంఎం రమాదేవి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు విజయ్‌కుమార్, రామాంజినేయులు, రామకృష్ణ, ఒలిపి శ్రీనావాసులు, మల్లిరెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు శ్రీరామరెడ్డి, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

● కొత్తచెరువు: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సోమవారం మండలంలోని కొడపగానిపల్లి, తలమర్ల, మీర్జాపురం, కొత్తచెరువులో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను వారి ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలి

బత్తలపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా పేద ప్రజలను ఆదుకుంటున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను పునరుద్ధరించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఫాదర్ ఘాట్ వద్ద నుంచి ర్యాలీగా నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను పునరుద్ధరించాలంటూ రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదని వారిని అక్కడి నుంచి పంపేశారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు కాటమయ్య, వెంకటేశు, ఓబులేశు, రామక్రిష్ణ, సత్యమయ్య పాల్గొన్నారు.

మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

● బీజేపీ నాయకులు ● రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ బీహార్‌లో నిర్వహిస్తున్న ఓటర్ అధికార్ యాత్ర సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లి హీరాబెన్ మోదీపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు తగవని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు ధర్మవరంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోదీపై దూషణలు, ధిక్కారాలు ప్రధానమంత్రంగా పెట్టుకుని ప్రతి కూల రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇది మన సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలపై మచ్చవేసే చర్య అన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందుకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబటి సతీశ్, సాకే ఓబుళేశు, జింకా చంద్ర, తలమర్ల హరికృష్ణ, గొట్లూరు చంద్ర, డోలా రాజారెడ్డి, పోతుకుంట రాజు, గుండా పుల్లయ్య, నబీరసూల్, సాకే మహేశ్ పాల్గొన్నారు.

స్త్రీ శక్తితో ఆనందం

● ఎమ్మెల్యే కందికుంట



మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కదిరి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళల్లో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పీవీ ఆర్ గ్రాండ్‌లో సోమవారం స్త్రీ శక్తి పథకం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తల్లికివందనం పథకం అమలు చేసినప్పుడు ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వంగా ప్రజలు భావించారని, ఇప్పుడు స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ప్రభుత్వం పట్ల పూర్తి విశ్వాసం కలిగిందని అన్నారు. 'సూపర్ సిక్స్ సూపర్‌హిట్' అనే మాట రాష్ట్ర మంతా మార్మోగుతుంటే వైసీపీ వారికి మాత్రం కళ్లు, చెవులు రెండూ పనిచేయడం లేదని ఎద్దేవ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్‌షాదున్నీషా, స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌బాను, జనసేన నాయకులు భైరవ ప్రసాద్, ఏపీఎం జయంతి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా 3,330 మంది మహిళ సంఘాలకు సభ్యులకు మంజూరైన రూ.28.23 కోట్లు, స్త్రీ నిధి ద్వారా 1127 మంది మహిళలకు మంజూరైన రూ.9.52 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుధారాణి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొమ్మినేని గంగయ్య నాయుడు, టీడీపీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్, బహద్దీన్, సిరి బాబాయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే కందికుంట పట్టణంలోని 16వ వార్డులో సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్‌షాదున్నిసా, టీడీపీ నాయకులు అనిల్ కుమార్ రెడ్డి, పాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రంపై సీఎంది చెరగని ముద్ర

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్



పరిటాల శ్రీరామ్‌కు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెరగని ముద్ర వేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా పదవి చేపట్టి 30 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లను తినిపించుకున్నారు. కంగ్రాట్స్ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గ కార్యకర్తల తరఫున పరిటాల శ్రీరామ్ చంద్రబాబునాయుడుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ... రాజకీయాల్లో రాణించడం కష్టంగా ఉన్న ఆ రోజుల్లోనే చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఒక రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ఆ రోజు హైటెక్ సిటీ నుంచి నేటి అమరావతి, పీ4వరకు ఆయన తీసుకున్న నిర్ణయాల్లో ప్రతిదీ సంచలనమే అన్నారు. విమర్శలు చేసిన నోళ్లు మూతపడేలా ఆయన పాలన సాగించి చూపించారన్నారు. ఆయన విద్యార్థి దశ నుంచి సాగించిన ప్రయాణం యువతకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, నాయకులు గొట్లూరు శీన, భీమనేని విజయసారథి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేడు జనసేన సేవా కార్యక్రమాలు

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీపట్టణ అధ్యక్షుడు అడ్డగిరిశ్యాం కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు కొత్తపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం కేక్‌కట్ చేస్తామన్నారు. 10-30కు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ, అనంతరం ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాలలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కొత్తపేటలోని షిర్డీసాయిబాబా ఆలయంలో 12గంటలకు అన్నదానం చేపడుతామన్నారు. కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డు నేసేపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపాలిటీకి చెందిన భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే తరచూ ఆ భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షాకాలంలో నెమ్ము ఎక్కి కారుతోందని చిన్నారుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు చుట్టూ చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా చుట్టూ అపరిశుభ్రంగా ఉండటంతో పాములు తరచూ సంచరిస్తున్నాయని అంటున్నారు. ఈ పాములతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. అంగన్‌వాడీకేంద్రం సమస్యను తెలియజేస్తూ, మరో చోటకు మార్చాలని గతనెలలో నిర్వహించిన 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకెళ్లారు. దీంతో శ్రీరామ్ ఆదేశాల మేరకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, సాగునీటి సంఘం అధ్యక్షుడు రేనాటి శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు పాళ్యం కృష్ణ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అందులో సమస్యలను గుర్తించి మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.



కేంద్రం వద్ద చెత్తాచెదారం



శిథిలావస్థకు చేరిన భవనంలో చిన్నారులు

అర్జీలపై అలసత్వం వద్దు: జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారంకోసం వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి వచ్చే ఫిర్యాదుదారుల అర్జీల పట్ల ఎటువంటి అలసత్వం వద్దని, సకాలంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో జేసీ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 174 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో ఉన్న వాటికి సత్వర న్యాయం జరగాలి

● ఎస్పీ రత్న



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజాఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ వి. రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో ఉన్న వాటిని సత్వరమే విచారణ జరిపి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ 45 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కాలువలు సర్వే చేయాలని వినతి

కొత్తచెరువు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం చెరువుకు ఉన్న తూముల నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే సాగునీటి కాలువలను సర్వే చేసి హద్దులను గుర్తించాలని సాగునీటి సంఘం అధ్యక్షుడు పీవీ నవీన్‌కుమార్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు విన్నవించారు. ఆయన సోమవారం డైరెక్టర్లు పత్తిపాటి మధు, చలపతితో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. సాగునీటి కాలువలను చాలామంది ఆక్రమించారని, కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. దీంతో సాగునీటి కాలువలు కుంచించుకు పోవడంతో పొలాలకు నీరు అందడం లేదన్నారు. కావున సాగునీటి కాలువల సర్వే చేసి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని వారు విజ్ఞప్తిచేశారు.

'వెంటనే వాహనమిత్ర అందించాలి'

ముదిగుబ్బ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా వెంటనే రూ. 25 వేలను అందించాలని ఆటో కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం ద్వారా ఆటో కార్మికుల కుటుంబాలు ఉపాధి కోల్పోయి ఆటోలపై తెచ్చిన రుణాలను కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. వాహన మిత్ర ద్వారా రూ. 25 వేలను వెంటనే అందించాలన్నారు. అలాగే 21వ జీఓను, హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, టైలర్ ముత్తు, షెక్షావలి, ఫక్కీరప్ప, బాబావలి, బాబా ఫకృద్దీన్, బాబు, అల్లా బకాష్ పాల్గొన్నారు.

ఆలయాన్ని కూల్చి, పునర్నిర్మించాలని వినతి

తనకల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మూడురోజుల క్రితం గాలివానకు మండల కేంద్రంలోని పురాతన అంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న వేప కొమ్మ విరిగి పడింది. దీంతో బండలు పగిలిపోయి, ఆలయం కూలిపోయే పరిస్థితిలో ఉంది. ఆలయం కూలిపోతే లోపలున్న విగ్రహాలు దెబ్బతినే ప్రమాదముంది. దీంతో ఆలయాన్ని ఎండోమెంటు బోర్డు ద్వారా కూల్చివేసి పునర్నిర్మాణం చేపట్టాలని సోమవారం ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్ షాబుద్దీన్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ఎండోమెంటు బోర్డుకు తెలియచేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కరుణాకరరెడ్డి, సతీష్, నాగభూషణం, పలువురు గ్రామ పెద్దలున్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ



పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

ధర్మవరం, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పండుగలా పంపిణీ చేశామని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ తెలిపారు. సోమవారం పట్టణంతో పాటు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో కూటమి నాయకులు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌హిట్ కావడంతో వైసీపీ నాయకులకు మతిభ్రమించిందని ఆయన ఎద్దేవాచేశారు. ఏ ఒక్కరి పింఛన్‌ను ప్రభుత్వం తొలగించదని ఆయన పేర్కొన్నారు.

పనుల వద్దకే వెళ్లి..



పొలం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా తీసుకుని లబ్ధిదారుల తలుపు తట్టి అందజేస్తోంది. మండలంలోని కత్తే కొట్టాల గ్రామంలో సోమవారం కొందరు పింఛన్‌దారులు గ్రామ సమీపంలోని వరి పొలంలోకి కలుపుతీసే పనులకు వెళ్లారు. పింఛన్ అందించేందుకు వారి ఇళ్ల వద్దకు వెళ్లిన గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనాథ్ విషయం తెలుసుకుని, వారు పనులు చేసే పొలం వద్దకు వెళ్లి టీడీపీ నాయకుడు కత్తేకొట్టాల ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. దీంతో పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

హౌసింగ్ పీడీ వెంకటరమణ



హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లకు అవగాహన కల్పిస్తున్న పీడీ

లేపాక్షి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ వెంకటరమణ సూచించారు. మండల వ్యాప్తంగా 300 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయని వెంటనే లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన గృహనిర్మాణాల పనులను లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి చేయాలని సూచించారు. ఒక్కో ఇంటికి రూ.1.80లక్షలు ప్రభుత్వం వెచ్చించిందని ఇప్పుడు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు మంజూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులవద్దకు వెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. సకాలంలో గృహాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంఈవై పథకం కోసం, స్థలం ఉండి ఇళ్ల మంజూరు కోసం 870 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. లబ్ధిదారులకు కేంద్రం నుంచి అనుమతి రాగానే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది, ఎంపీడీఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

మడకశిర రూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి ఆదేశించారు. సోమవారం మండలంలోని కల్లుమర్రి పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు రికార్డులను పరిశీలించారు. ఓపీని తనిఖీ చేసి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయని, జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మేల్కొన్న అధికారులు



తాగునీటి ట్యాంకు చుట్టూ శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రొద్దం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దకోడిపల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు చుట్టూ నెలకొన్న అపరిశుభ్రతను పంచాయతీ అధికారులు తొలగించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'నిండుకున్న నిర్లక్ష్యం' కథనానికి స్పందించి పంచాయతీ అధికారులు ట్యాంకు చుట్టూ మోకాళ్లలోతున్న నీటిని తొలగించారు. ట్యాంకు చుట్టూ నిండుకున్న నీరు బ్లాక్ అయిన పైప్‌లైన్‌ను శుభ్రం చేసి నీరు వెళ్లేలా చేశారు. ఈఓఆర్డీ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి సరిత తదితరులు పనులను పర్యవేక్షించారు.

ధర్మస్థలను అపవిత్రం చేయకండి

- మహిళా సంఘాలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

పావగడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ధార్మిక కేంద్రం ధర్మస్థల పవిత్రతను అపవిత్రం చేయవద్దని మహిళలు, పలు సంఘాలు పెద్దఎత్తున సోమవారం నిరసన చేపట్టాయి. పావగడ ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురుభవనం నుంచి శనైశ్వరసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్మస్థలాన్ని రక్షించండి... ధర్మాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. రాజకీయాల పేరిట లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హత్యారాజకీయాలని మాట్లాడటం తప్పని, ధార్మిక కేంద్రాన్ని అపవిత్రం చేయవద్దని హితవుపలికారు. తమ ఉనికి కోసమే కొందరు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక కోర్సుల భర్తీకి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ 1, గణిత శాస్త్రం, వృక్షశాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఈనెల 6వ తేదీలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 8వ తేదీ కళాశాలలో మౌలిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పెనుకొండ రూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుట్టూరు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. 55ఏళ్ల వయసుగల వ్యక్తి జాతీయరహదారి పక్కన అనుమానాస్పదంగా మృతిచెందాడని సమాచారం అందిందన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు ఎర్రరంగు గళ్లచొక్క, ఖాకీ ప్యాంటు ధరించాడని, మెడలో పసుపురంగు తువాలు వేసుకున్నాడని పేర్కొన్నారు. ఎవరైనా గుర్తిస్తే కియ పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

శునకాలతో హడల్

గ్రామాల్లో వీధికుక్కల స్వైరవిహారం

కట్టడి చేయాలని గ్రామస్థుల వినతి



గుంపులుగా వీధికుక్కలు

చిలమత్తూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల సంఖ్యను నియంత్రించాల్సిన శాఖలు పట్టించుకోకపోవడంతో శునకాలు ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. మండలంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గ్రామాల్లో వీధు కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మండలవ్యాప్తంగా వీధుల కుక్కల సంఖ్య రెండు వేలకు పైనే ఉంటుందని పశువైద్య అధికారులు తెలిపారు. అయితే ఇటీవల కాలంలో గొర్రెల మందలు, మనుషులపై ఎక్కువగా దాడులు చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పొలాల్లోకి మేత కోసం వెళ్లే గొర్రెలపై దాడి చేస్తున్నాయని గొర్రెల కాపర్లు వాపోతున్నారు. ఇటీవల పలగలపల్లి గ్రామ ప్రాంతంలో కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి నాలుగు గొర్రెలను తీవ్రంగా గాయపర్చాయి. మొరసలపల్లికి చెందిన ఒక గొర్రెల కాపరి తన గొర్రెల మందను బీడు భూముల్లో మేపుకొంటుండగా మందపై దాడి చేసి రెండు గొర్రెలను చంపేశాయి. గ్రామాల్లో సైతం చిన్నారులు, వృద్ధులపైనా దాడి చేసి గాయపరుస్తున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పెంపుడు కుక్కలకు విధిగా యాంటీ రేబిస్ టీకా వేయించాలి. కుక్క కాటుకు గురైతే 0-3-7-8 రోజుల్లో నాలుగుసార్లు ఇంజక్షన్ తీసుకోవాలి. వ్యాధి తీవ్రత పెరగకుండా నివారణ టీకాలు వేయించాలి. పిచ్చి కుక్కల లాలాజం మనుషులు, పశువులపైనా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

నియంత్రణకు చర్యలు ఏవీ..?

వీధి కుక్కలను గుర్తించి వాటికి యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్థులు అంటున్నారు. ఇటీవల కాలంలో వీధి కుక్కల దాడులు ఎక్కువయ్యాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీధి కుక్కలతో భయమేస్తోంది



వీధి కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. వాటిని చూస్తానే భయమేస్తుంది. కుక్కలు గుంపులుగా ఉంటూ కోళ్లు, చిన్న చిన్న గొర్రె పిల్లలపై దాడి చేసి చంపేసి తినేస్తున్నాయి. చేతుల్లో ఏదైనా పట్టుకొని వస్తే వెంటనే అరుచుకుంటూ వెంటపడుతున్నాయి. పిల్లలు, ముసలోల్లు వీధుల్లోకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు వాటిపై దృష్టి పెట్టి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

-అశ్వత్థరెడ్డి, మరవకొత్తపల్లి

వీధి కుక్కలను నియంత్రించాలి



ఇటీవల వీధి కుక్కలు బాగా పెరిగిపోయాయి. రోడ్డుపై గుంపులు గుంపులుగా ఉంటూ దారిని పోయే వారిని వెంబడిస్తున్నాయి. దాడులకు పూనుకుంటున్నాయి. చాలామంది కుక్కకాటుకు గురవుతున్నారు. వాటి నుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి వెంటనే వీధి కుక్కలకు వాక్సిన్లు వేయాలి. వాటిని వీధుల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలి.

-నారాయణస్వామి, పెద్దన్నపల్లి

బాధితులకు మంత్రి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

హిందూపురం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనంలో జరిగిన ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిమజ్జనం సందర్భంగా విగ్రహంతో వెళ్తున్న ట్రాక్టర్ జనంపై దూసుకెళ్లడంతో టీడీపీ కార్యకర్త మారుతి మృతిచెందగా పలువురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ చేనేతజౌళిశాఖ మంత్రి సవిత సోమవారం హిందూపురానికి చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అక్కడే పోస్టుమార్టం గదివద్ద ఉన్న మారుతి మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవుని కార్యక్రమంలో ఇలా జరగడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని, అవసరమయ్యే ఖర్చును భరిస్తామన్నారు. మంత్రి వెంట మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్‌బాలాజీ, వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి అనుబంధ కమిటీలు కీలకం

మున్సిపల్ చైర్మన్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీకి అనుబంధ కమిటీలు ఎంతో కీలకమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఏఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో పట్టణ, టీడీపీ అనుబంధ కమిటీల ఏర్పాటుపై నాయకులు, కార్యకర్తలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి అనుబంధ కమిటీలు ఎంతగానో తోడ్పాటునందిస్తాయన్నారు. పార్టీ సిద్ధాంతాల ప్రకారం ముఖ్యమైన పట్టణ కమిటీతోపాటు తెలుగు యువత బీసీసెల్ మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, టీఎన్‌టీయూసీ, తెలుగు మహిళ కమిటీలు ముఖ్యమన్నారు. పార్టీ పదవులు తీసుకున్నాక ఇళ్లలో ఉంటే సరిపోదని, కష్టపడేవారే పదవులకు అర్హులన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు కమిటీలకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ వివరాలు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్తామని కమిటీల నిర్మాణం ఆఖరుగా ఎమ్మెల్యేదేనన్నారు. కార్యక్రమంలో కొల్లకుంట అంజినప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు డాక్టర్ సురేంద్ర, నాగరాజు, నెట్టప్ప, డైమండ్‌బాబా, నవీన్, పరిమళ, షబ్బీర్, రాఘవేంద్ర, చంద్రమోహన్, సతీష్, మంగేష్, లీగల్‌సెల్ శివశంకర్, రవీంద్రనాయుడు, ప్రవీణ్, కోరుముట్ల నాగేంద్ర, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్నానదిలో పూజలు

రొద్దం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో పంచలోహ వినాయక విగ్రహ పూజ మంగళవారం నిర్వహిస్తున్నట్లు శ్రీరామ భక్త మండలి సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రొద్దం పెద్దాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం 6 గంటలకు ఆకు పూజ, అభిషేకాలు ఉంటాయని, 7 గంటలకు పెన్నానదిలో రుద్రాభిషేకం, అష్టోత్తరపూజలు జరపనున్నారన్నారు. సాయంత్రం 4 గంటలకు ఊరేగింపు ఉంటుందని, భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జీనవాండ్లపల్లిలో పగలే చోరీ

గోరంట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనవాండ్లపల్లి కొత్తలేఅవుట్‌లో నివాసం ఉంటున్న నవాజ్ ఇంటిలో సోమవారం చోరీ జరిగింది. నవాజ్, అతడి భార్య ఇషరాత్ పెనుకొండలోని కియ పరిశ్రమలో పనిచేస్తున్నారు. అద్దెకుంటున్న ఇంటికి తాళం వేసి సోమవారం ఉదయం విధులకు వెళ్లారు. సాయంత్రం తిరిగివచ్చేసరికి తలుపులు పగలకొట్టి ఉండటాన్ని గమనించారు. లోనికి వెళ్లి చూడగా బీరువా పగలకొట్టి అందులోని మూడులాల నక్లిస్, రూ.9,200 నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ

అమరాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో సెట్ ట్రీస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు సీఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఒక రైతుకు ఎకరాకు 72 మామిడి, మహాగని 40, ఎర్రచందనం 18, కొబ్బరి 4, నేరేడు 72, నిమ్మ 144 మొక్కలను అందించే కార్యక్రమం ఉంటుందని వివరించారు. 1 నుంచి 10 ఎకరాల భూమి కలిగిన రైతులకు మాత్రమే ఈ అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మడకశిర డివిజన్‌లో 50వేల మొక్కలు పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగభూషణ్, టీడీపీ యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్, పార్లమెంట్ తెలుగయు యువత ఉపాధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

16 మందిపై కేసు నమోదు

గోరంట్ల, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపల్లిలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో 16మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాలు మారణాయుధాలతో ఘర్షణ పడడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సకాలంలో గ్రామానికి వెళ్లి అడ్డుకున్నారు. కొంతకాలంగా ఇరు వర్గాల మధ్య పాత కక్షలు ఉన్నాయని, వడ్డె నాగరాజు వర్గంలోని 8 మంది, చౌడిరెడ్డి వర్గానికి చెందిన 8 మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ వివరించారు.



ధనాపురంలో నిమజ్జనానికి తరలుతున్న విగ్రహం

ఘనంగా వినాయక నిమజ్జనం



గుడిబండలో...

వినాయక నిమజ్జనాన్ని సోమవారం కొన్ని ప్రాంతాల్లో నిర్వహించారు. పెనుకొండ మండలం కోనాపురం, పరిగి మండలంలోని ధనాపురం ఎస్సీ కాలనీ, గుడిబండలోని ఎస్ రామాపురం, గుడిబండ గ్రామాల్లో ఘనంగా చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని నిర్వహించారు

-న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి)

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నాగులకట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

రొళ్ల/గుడిబండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగుల చవితి పండుగను గ్రామస్థులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. బిజిహళ్లి, అగ్రహారం, మల్లసముద్రం, హనిసేకుంట తదితర ప్రాంతాల్లో నాగుల కట్టల వద్ద పాలుపోసి భక్తులు పండుగను చేసుకున్నారు. అదేవిధంగా గుడిబండ మండలం ఎస్ రాయాపురం, ఎస్ఎస్‌గుండ్లు, పూజారిపల్లి తదితర గ్రామాల్లో పండుగను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. నాగులకట్ట వద్ద ప్రత్యేక అలంకరణచేసి పాలుపోశారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

మడకశిర టౌన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యల వద్ద సోమవారం సాయంత్రం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని వాల్మీకిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వినాయకులకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది వినాయకుడి మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందించడం, వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు బాగా పండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షులు నాగరాజు, కౌన్సిలర్లు ఉమాశంకర్, నాయకులు మాధవరాజు, ఓబులేశు, తిమ్మరాజు ఉన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే



హారేసముద్రంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మండలంలోని హారేసముద్రం గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు పింఛన్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వారి వెంట రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ నాగరాజు. నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమల గ్రామంలో ఏర్పాటుచేసి ఆధార్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని గుండమల మాజీ సర్పంచు గుండమల చంద్రప్ప తెలిపారు. సోమవారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారు, వృద్ధులు, మహిళలు ఆధార్‌లో ఉంటే కేంద్రంలో సరిచేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు భూపోరాటం

- రైతు సంఘం నాయకులు



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మడకశిర రూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీ కోడిగేపల్లి, కేతేపల్లి, పరిగి గ్రామాలకు చెందిన రైతులతో బుధవారం భూ పోరాటం నిర్వహిస్తున్నట్లు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు హరి, మండల కార్యదర్శి సీఆర్ వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 ఎళ్ల క్రితం పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని మడకశిర, పరిగి మండలాల్లోని 11 గ్రామాల్లో దాదాపు 2600 ఎకరాల భూములు రైతుల నుంచి తీసుకోవడం జరిగిందని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు అయితే నేటికీ ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, దీంతో రైతులు భూ పోరటానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు. బుధవారం జరిగే భూపోరాటానికి ఏపీ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి రానున్నట్లు తెలిపారు.

తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పావగడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న కసబా హోబ్లిస్థాయి క్రీడాపోటీల్లో వెంకటేశ్వర ఇంగ్లీష్ హైస్కూల్ విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని విజయం సాధించారు. బాలుర విభాగంలో భార్గవ్ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం, దర్శన్ 800 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ, చరణ్‌తేజ్ 1500 మీటర్లలో ద్వితీయ, లాంగ్‌జంప్‌లో పవన్‌కల్యాణ్ మొదటిస్థానం సాధించారు. హైజంప్‌లో దీక్షిత్ మొదటిస్థానంలోను, ట్రిపుల్‌జంప్‌లో జగన్‌మోహన్‌రెడ్డి, ప్రథమ, పవన్ మూడో స్థానంలో నిలిచారు. తాలూకాస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, సురేష్, పరంధామరెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

పావగడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్ర హోంమంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్‌ను ఎమ్మెల్యే వెంకటేశ్ సోమవారం కలిశారు. తుమకూరు నగరంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో హోంమంత్రి కలిసి పూలమాలలువేసి కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ పరమేశ్వర్‌తో ఎమ్మెల్యే వెంకటేశ్